కథా నిలయం
3537
శ్రీకాకుళం

# మరుగుపడిన మమత

ముసలితనం చీకటి లాంటిది. అందులో ప్రేమా, ఆదరణా కరువైతే కీచురాళ్ళ రొద తోడైనట్టు మరింత భయంకరంగా పరిణమిస్తుంది.

సావిత్రమ్మ మనసులో ఇటువంటి భావన ఈ మధ్యనే సుమారు నెల రోజుల నుంచి కలుగుతోంది. ఈ చరమ దశలో తనకు ప్రశాంతంగా కళ్ళు మూసే అదృష్టం రాసిపెట్టిలేదేమో అనుకుంది.

చిన్న కోడలు సరళ "అత్తయ్యా?" అని నోరారా పిలిచేది. ఈ మధ్య ముభావంగా ఉంటోంది. లెక్కగా - నిర్లిప్తంగా మాట్లాడుతోంది. కోడలు పనుల్లో - బాధ్యతల్లో మునిగినా - మనవలిద్దరూ - "మామ్మా? కథ చెప్పవూ?" అని వచ్చి పక్కను చేరి కొంతసేపు ఆమెతో గడిపి వెళ్ళడం జరిగేది.

పెద్ద కోడలు భువనేశ్వరి కలకత్తా నుంచి వచ్చి వెళ్ళిన నాటి నుంచి ప్రశాంతంగా సాగుతున్న ఆమె జీవితంలో ఏదో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మార్పుకూ, భువనేశ్వరి రాకకూ ఏదో సంబంధం ఉందని ఆమె కుమిలిపోసాగింది. భువనేశ్వరి వెళ్ళిపోయిన తరువాత వారం రోజులపాటు కొడుకు సుందరం - చిన్న కోడలు సరళ ఏదో ఘర్షణ పడడం - వాదించుకోవడం ఆమె చెవిని పడింది. తన సంరక్షణ గురించే ఈ వివాదం.

పిల్లల చిన్నారి మనసుల్లో పెద్దల అసాధారణమైన ప్రవర్తన ఎలాంటి సంచలనం కలిగించిందో ఏమో - లేక ఈ ఘర్షణ కంతటికీ నాయనమ్మే కారణం అనుకున్నారో - లేక తల్లి కొడుతుందన్న భయమో మనవలిద్దరూ చనువుగా సావిత్రమ్మ దగ్గరకు రావడం లేదు.

"ఎవ్వరికీ అక్కరలేని దాననయ్యాను" అన్న నిరాశ చోటు చేసుకుందామె మనసులో.

"నాకు ఈ పక్షవాతం రాకుండా కాళ్ళూ, చేతులూ వశంలో ఉండగా కళ్ళు మూసుకుంటే - ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదేమో?" అని నిట్టూరుస్తూ - "ఇవాళ మధ్యాహ్నం నుంచీ మరీ మౌన ముద్ర వేసుకుంది చిన్న కోడలు" అనుకుంది ఒకనాటి సాయంత్రం సావిత్రమ్మ.

అదే సమయంలో వానకు చిక్కకుండా త్వరపడి ఇల్లు చేరుకున్న సుందరం కాలి జోళ్ళు విప్పుకుంటున్నాడు.

"సెలవు పెట్టేరా?" అని అడిగింది సరళ.

సెలవు దేనికన్నట్లు పరాకుగా చూస్తున్న సుందరం చెవిలో - "అవును - ఎందుకు పెడతారులెండి. ఏదో నా కంటి తుడుపుకు ఆ క్షణం అలా అన్నారు కానీ - మీకు జ్ఞాపకం ఉంటే కదా?" అన్న మాటలు వ్యంగ్యంగా - నిష్ఠూరంగా ధ్వనించాయి.

అప్పటికి కానీ సుందరానికి అసలు విషయం గుర్తుకు రాలేదు. అతని వదిన వచ్చి వెళ్ళిన మరునాడే "సెలవు పెట్టి - అత్తగారిని కలకత్తాలో విడిచిరండి" అని సరళ పేచీ పెట్టింది.

వాద ప్రతివాదాల తరువాత - "అలాగేలే- ఇప్పుడు సెలవు దొరకదు. నెల పోయినాక సెలవు పెడతా" అని అప్పటికి ఆ ఇరుకులోంచి బయట పడ్డాడు సుందరం.

మళ్ళీ సరళ ఈ ప్రస్తావన తీసుకు రావడానికి ఏదో బలమైన ప్రేరేపణ ఉందని అతనికేం తెలుసు? బయట కురుస్తున్న వానకు చిక్కకుండా ఇంట్లో అడుగు పెట్టిన సుందరానికి ఎదురైన ఈ అనుకోని గాలి వాన చాలా కలవర పెట్టింది.

"అత్తగారిని మీ అన్న గారింట్లో విడిచిరండి. నా పిల్లలనే చూసుకోనా? - చంటి పిల్లలాగున్న అత్తగారికే సంరక్షణ చేసుకోనా? చాలీ చాలని ఆదాయంతో - పని మనిషి దొరక్క సంవత్సరం పాటు ఎలాగో నెట్టుకు వచ్చాం. కాస్త మీ వదిన కూడా ఈమె సేవ చేసి తరించనీయండి. పెద్ద కొడుకు దగ్గర తల్లి ఉండడం విధాయకమే" అంది నిష్కర్షగా సరళ - భువనేశ్వరి వెళ్ళిన మరునాడే.

"మా అమ్మకు నేను ఒక్కడినే కొడుకునైతే ఏంచేసే దానివి చెప్పు? ఏడు పదులు నిండిన వయసులో పక్షవాతం వచ్చినా కేవలం మంచాన పడిపోకుండా ఏదో కోలుకుంది. బ్రతికినన్నాళ్ళు బ్రతుకుతుందా? అంత దూరం ఈ వయసులో ఎందుకు ప్రయాణం కట్టిస్తావు?" అన్నాడు నెమ్మదిగా సుందరం.

అలా బ్రతిమాలుతున్న సుందరం మనసులో పాత విషయాలెన్నో మెదిలాయి.

సుమారు ఎనిమిదేళ్ళ క్రితం - "అమ్మను కలకత్తా తీసుకొని వెళతాను" అని అన్న అంటే సుందరం తల్లిని పంపించాడు. సావిత్రమ్మ కూడా కాదనలేక వెళ్ళింది. ఖైదీలా ఐదారు నెలలు గడిపి తిరిగి వచ్చేసింది. అక్కడి వాతావరణంతో సరిపెట్టుకోలేకపోయింది.

వదినకు మహిళా మండలి కార్యక్రమాలు తప్పనిసరి. అన్న ఇంట్లో ఉండటమే అరుదు. ఇల్లు తీసి పందిరి వెయ్యగల పిల్లలు. అర్థం కాని బెంగాలీ భాష మాట్లాడే ఇరుగు పొరుగు. చాకిరికి తప్ప ఎవ్వ

రికీ గుర్తింపుకు రాని యంత్రాన్ని అనుకుంటూ బాధపడి తిరిగి వచ్చిన తల్లి మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు సుందరం. భర్త ముఖంలోకి చూస్తే తన పట్టుదల ఎక్కడ సడలిపోతుందో అని తీక్షణంగా ఎటో చూస్తూ- "నాలుగు రోజులు సెలవు పెట్టండి ఆమెను దింపిరావడానికి చాలు. మీ వదినకు అసలే చీమకుట్టినట్లు లేదు నా బాధ. ఉత్తరం రాస్తే పట్టించుకునే స్వభావం కాదు మీ అన్నగారిది" అన్న సరళ మాటలు సుందరాన్ని జ్ఞాపకాల వలయంలోనుంచి వాస్తవంలోకి లాక్కువచ్చాయి.

ముక్కు మీద కోపం సరళకు సహజమే కానీ ఆ కోపం క్షణికమే అటువంటిది ఇవాళ ఇంతగా అత్తగారిని కలకత్తా పంపమని మంకుపట్టు పట్టడానికి కారణం ఏమిటో సుందరానికి తెలియలేదు.

ఉదయమే భర్తను ఆఫీసుకూ, పిల్లలను బడికీ పంపి - అత్తగారికి స్నానం చేయించి తల దువ్వి - భోజనాలు ముగించే సరికి తల ప్రాణం తోకకు వచ్చింది కాస్త పడుకుందామనుకుంటున్న సమయంలో ఆ వేళ వచ్చిన వార పత్రిక తిరిగేస్తూ ఉంటే ఒక ఫోటో సరళ కళ్ళపడింది.

కలకత్తాలోని ఆంధ్ర మహిళా మండలి కార్యకర్తలు వికలాంగులకు కొన్ని కృత్రిమ ఉపకరణాలు ఉచితంగా పంచిపెడుతూ తీయించుకున్న ఫోటో అది. తోటి కోడలు భువనేశ్వరి ఆ ఫోటోలో పడాలని ప్రక్కనున్న వాళ్ళని నెట్టుకుంటూ మరీ నిలుచుని ఉంది.

"ఇంట గెలవలేని వాళ్ళంతా రచ్చగెలవాలనీ - రాజ్యం చెయ్యాలనీ ఆరాటం" అంటూ గునిసింది వార పత్రికను పక్కకు నెట్టిన సరళ.

ఒక నెల క్రితం మేనల్లుడి ఉపనయనం అంటూ ఈ ప్రాంతా

నికి వచ్చిన భువనేశ్వరి అత్తగారిని చూడడానికి ఒక రోజు సుందరం ఇంటికి వచ్చింది.

అత్తగారు - పక్షవాతం వచ్చి కోలుకున్నాక - భువనేశ్వరి అదే రావడం. అంతకు ముందు 'అమ్మకు సీరియస్‌గా ఉందని" సుందరం టెలిగ్రామ్ ఇస్తే అన్న వచ్చి వెళ్ళాడు - కానీ భువనేశ్వరి రాలేదు. పిల్లలకు ఒంట్లో బాగులేదని కలకత్తాలోనే ఉండిపోయింది. అలా వచ్చిన భువనేశ్వరితో అత్త గారు ఎలా మంచానికి అంటుకుపోయిందీ- ఎలా క్రమంగా కోలుకున్నదీ వివరించి - "మీరు కొన్నాళ్ళు కలకత్తాలో అత్తగారిని ఉంచుకుంటే మాకు కాస్త ఊపిరి పీల్చుకున్నట్లు ఉంటుంది" అని సూచించింది - సరళ.

సరళ కంఠ శోషకు ప్రయోజనం లేకపోగా - భువనేశ్వరి ఏవేవో అప్రస్తుత విషయాలు మాట్లాడింది. ఇదివరలో సరళ కాపురానికి వచ్చిన కొత్తలో అత్తగారిని తీసుకొని కలకత్తాలో ఐదారు నెలలు ఉంచుకున్నందుకు ఎంతో ఘనకార్యం, ఉపకారం చేసినట్లు చెప్పుకుంది. కానీ - అప్పటి పరిస్థితికీ - ఇప్పటి పరిస్థితికీ ఏమైనా పోలిక ఉందా? అని భువనేశ్వరి ఏ మాత్రం ఆలోచించినట్లు కనపడలేదు. అప్పట్లో అత్తగారు ఆరోగ్యంగా ఉండడమే కాదు. ఆమె ఎక్కడ ఉన్నా ఏనుగున్నంత బలం. వంటా వార్పూ ఆవిడే చూసుకునేది. మనవల్ని సముదాయించి ఇల్లంతా చక్కబెట్టుకునేది అలా ఆవిడ మసలుకుంటే చంటీ వెంటీతో సతమతమైపోతున్న భువనేశ్వరి నిలదొక్కుకోగలిగింది. అందుకే బావగారు కలకత్తా నుంచి వచ్చి సుందరాన్ని ఒప్పించి మరీ తల్లిని తీసుకొని వెళ్ళాడు కూడా.

ఇప్పుడు ఆమె పరిస్థితి వేరు. పక్షవాతం వచ్చి తేరుకున్నా - ఆమెకు స్నానం చేయించి - బట్ట కట్టి - తల దువ్వి - చిన్న పిల్లను చూసినట్లు చూసుకోవాలి. ఆఫీసుకు పోయే కొడుకు ఉద్యోగం మాని ఈ పనులు చెయ్యలేడు కదా?

"నాకు మాత్రం చిన్న పిల్లలు లేరూ? నేను ఆమె కన్నా చిన్న దాన్ని కానూ? అసలు భువనేశ్వరికి మొదటి నుంచీ నేనంటే అలుసే? తానే నగలతో - కట్నకానుకలతో వచ్చిందని మిడిసిపాటు" అని మనసులో వాపోయింది సరళ.

ఈ విషయాలన్నీ ఒక ఎత్తూ - కలకత్తా వెళ్ళిపోతూ భువనేశ్వరి అన్న ఆఖరి మాటలు ఒక ఎత్తూ - ఆ మాటలు అనకుండా ఉంటే అసలు ఇంత పేచీ వచ్చేది కాదేమో?

"సరళా నువ్వు చిన్నదానివి. నీకున్న ఓపికా - సహనం నాకు లేదు. ఈ పరిస్థితిలో అత్తగారిని కలకత్తాలో పెట్టుకుని నేను భరించలేను. నీకు ఎంత పంపమంటావో చెప్పు మీ బావగారితో చెప్పి నెల నెలా నేను డబ్బు పంపే ఏర్పాటు చేస్తాను. కలకత్తా మాత్రం పంపకు సుమా?" అని బేరమాడింది భువనేశ్వరి. ఆ మాటలలో అభ్యర్థనకన్నా- "నా దగ్గర డబ్బు ఉంది - నేను ఏ ఏర్పాటైనా చేసుకోగల" నన్న అహం సరళ మనసును గాయం చేసింది. తన పేదరికాన్ని ఈ విధంగా ఎత్తి చూపినట్లు బాధపడింది సరళ.

కలకత్తాలో ఉద్యోగాలు చేసుకుంటున్న వాళ్ళకి ముసలి తల్లిదండ్రులు ఉండరూ? వాళ్ళని కొడుకులు ఎక్కడికి పంపివేస్తున్నారు? అని అడగాలని అనుకున్నా నోరు పెగిలి మాటలు వెలువలికి రాలేదు. తల్లికి ఒంట్లో బాగులేని అడపా దడపా వచ్చిన ఆడపడుచులు తల్లికి సరియైన సదుపాయం అందడం లేదని పెదవి విరిచారు కానీ - అన్న దగ్గరికి పంపమని ఎవరూ అనలేదు సుందరం ఆర్థిక పరిస్థితిని కూడా సరిగ్గా అంచనా వెయ్యలేదు.

అలాంటి సమయంలోనే అత్త గారిని కొన్నాళ్ళపాటు కలకత్తా పంపే ఏర్పాటు చెయ్యమనీ - లేదా సెలవు పెట్టి ఆమెను కలకత్తాలో దింపిరమ్మనమనీ సరళ భర్తతో వాదన పెట్టుకుంది. పాపం

సుందరం ఏమీ అనలేకా-తల్లిని కలకత్తా పంపడం ఇష్టం లేకా-"అలాగేలే" అంటూ నెట్టుకొని వచ్చాడు ఇన్ని రోజులూ ఈ విషయంలోనే రెండు రోజులు మాటలు మానుకోవడం, ఘర్షణ పడడం కూడా జరిగింది ఇద్దరి మధ్యా. ఈ మధ్య కాస్త ఈ వివాదం మరుగున పడిందని సుంద రం ఊపిరి తీసుకున్నా ఈ వార పత్రికలో పడ్డ ఫోటో మళ్ళీ సరళను కదిలించింది. పర్యవసానంగా తోటి కోడలు మీద అక్కసు ముసలి అత్తగారి మీద జాలిని వెనక్కి నెట్టేసింది.

ఇంట్లో అడుగు పెడుతూనే భార్య వేసిన ప్రశ్నల వర్షం - ఆమె ముఖంలోని రుస రుస సుందరాన్ని చికాకు పరిచాయి. సరళ ప్రతి పాదన సమంజసమా కాదా అన్న తర్కం ఎలా ఉన్నా తల్లి ఈ ప్రయాణంతో మానసికంగా నలిగిపోతుందని ఎంతో బాధపడ్డాడు.

బట్టలు మార్చుకుని బాత్ రూమ్‌లోకి పోబోతున్న కొడుకు వెను కనే మెల్లగా నీడలా వెళ్ళింది సావిత్రమ్మ.

ఒక చేతిని ఇంకొక చేత్తో ఎత్తి పట్టుకుని - ఒక కాలు ఈడుస్తూ- వచ్చిన తల్లి సుందరంతో - "నువ్వు దిగులుపడకు. పెద్ద కోడలు దగ్గర కొద్ది నెలలు ఉన్నాను అనిపించుకుని మళ్ళీ నీ దగ్గరకు వచ్చే స్తాను. నీ చేతి మీదుగానే ప్రశాంతంగా కళ్ళు మూసుకుంటాను. సర ళతో అనవసరంగా ఘర్షణ పడవద్దు. నన్ను కలకత్తాలో దిగపెట్టు" అని ఓదార్చింది. ఆమె ప్రతి మాట కాస్త ఈడుస్తూ అంటే అందరికీ అర్థం కావడం కష్టమే-కానీ కొడుక్కీ-కోడలికీ-మనవలకి కొన్ని నెలల నుంచీ అలవాటైపోయింది. కొన్ని మాటలకి మనవలిద్దరూ నవ్వుతారు కూడా.

'తల్లిని కలకత్తా పంపడం - కనీసం కొన్ని నెలలు అక్కడ ఉండే ఏర్పాటు చెయ్యడం — అనివార్యం అనుకున్నాడు సుందరం.'

అయితే సరళ ప్రతిపాదనకు ఒక చిన్న సవరణ చేశాడు. "లేడీస్ కూపేలో రిజర్వు చేయించి నిన్నూ అమ్మనూ కలకత్తా పంపుతాను. అన్నకు టెలిగ్రామ్ ఇస్తాను. అమ్మ వెంట నువ్వు వుంటేనే మంచిది. రైలులో ఏ అవసరం వచ్చినా నువ్వు ఆమెను చూసుకోగలుగుతావు. నేను సెలవు పెట్టి నువ్వు తిరిగే వచ్చే వరకూ పిల్లలిద్దరినీ చూసుకుంటాను" అన్నాడు.

ఆ విధంగానే పదిహేను రోజుల తరువాత తల్లినీ, సరళనూ హౌరా బండిలో ఎక్కించాడు. రైలు కదిలే దాకా ఉండి చిన్నబుచ్చుకున్న ముఖంతో ఇంటిదారి పట్టాడు. వచ్చే ముందు సరళతో–"అమ్మను జాగ్రత్తగా చూసుకో" అని చెప్పాలనుకున్నాడు. కానీ – మనసులోని వేదనతో మాట పెగిలి రాలేదు.

రైలు కదిలే వేళ భర్త ముఖంలోకి చూడలేకపోయింది సరళ. "పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి. చిన్నవాడు మరీ రోడ్డుమీదనే ఆడుకుంటాడు" అని చెప్పాలనుకున్నా సుందరం అన్యమనస్కంగా చెయ్యి ఊపుతూ ఉంటే రైలు కదిలిపోయింది. తన కళ్ళలోకి చూడకుండా భర్త తప్పించుకున్నాడేమో అనుకుంది సరళ మనసులో.

సావిత్రమ్మ రెండు కళ్ళూ మూసుకుని తన సీటులో కూర్చుంది. శుష్కించి ఎండుటాకులా ఉంది. కిటికీలోంచి వెనక్కు పోతున్న స్టేషనూ, ప్లాట్‌ఫారమ్, చెట్లూ, చేమలూ, భవనాలూ చూస్తూ ఆలోచిస్తోంది సరళ. చిన్న కొడుకు ఎండలో ఆడతాడని రబ్బరు బంతి తీసి దాచిపెట్టింది. మళ్ళీ ఇవ్వటం మరచిపోయింది. దాన్ని వెతుక్కుని దొరక్క–మారాం చేసి భర్త చేత దెబ్బలు తింటాడేమో? వాడికి రాత్రి తల్లి దగ్గరే పడుకునే అలవాటు. ఈ మూడు నాలుగు రోజులూ నిద్ర పోడు–అనుకుంది.

ఇంతలో పరుగు పెడుతున్న రైలు వేగం తగ్గి కర్కశంగా శబ్దం చేస్తూ ఆగింది. ఎక్కడో సిగ్నల్ ఇవ్వలేదేమో? ప్రయాణీకులు ఏవో ఊహాగానాలు చేస్తూ మాట్లాడుకుంటున్నారు. తన ఆలోచనల మధ్య కిటికీలోంచి చూస్తున్న సరళను ఒక దృశ్యం ఆకర్షించింది. మనసు ఆశ్చర్యంతో నిండిపోయింది.

ఒక గోడవార ముగ్గురు అల్లరి పిల్లలు ఒక పెద్ద పందిని ఇటుక బెడ్డలతోనూ, రాళ్ళతోనూ గురిచూచి కొట్టి హింసిస్తూ - అది బాధతో జాలిగా అరుస్తూ-మూలుగుతూ ఉంటే ఆటవికంగా ఆనందిస్తున్నారు. మహా ఉంటే ఎనిమిదీ-తొమ్మిది ఏళ్ళు మించి ఉండదు ఆ పిల్లల వయసు అంత పెద్ద పంది ఒక్క దూకులో అక్కడి నుంచి అవలీలగా పారిపోగలదు ప్రయత్నిస్తే-అలా బాధగా అరుస్తూ రోదిస్తూ ఆ దెబ్బలు భరించడం ఎందుకో అర్థం కాలేదు-నిశితంగా అటు చూస్తున్న సరళకు.

ఇంతలో రైలు మెల్లగా కదిలింది. కానీ ముందుకు పోక-వెనక్కు నడుస్తోంది.

తోటి ప్రయాణీకులు రణగొణ ధ్వనితో ఏదో-చెప్పుకుంటున్నారు.

ఈ రైలు కదలికలో సరళ చూపుకు అడ్డుగా ఉన్న ఒక చిన్న ముళ్ళ పొద వెనక్కు పోయి-ఆ పంది నాలుగు కాళ్ళ మధ్యా ఎర్రని మాంసపు ముద్దల్లా ఉన్న అప్పుడే పుట్టిన పంది కూనలు కనబడ్డాయి.

సరళకు సందేహ నివృత్తి అయ్యింది. ఆ కూనలకు ఏ రక్షణా లేకుండా అక్కడ వదలి పారిపోలేక - ఆ దెబ్బలు పసి కూనల మీద పడకుండా తానే భరిస్తూ రోదిస్తోంది. మాతృత్వానికి నిర్వచనంలా స్థిరంగా నిలుచుని హృదయ విదారకంగా అరుస్తోంది పంది.

రాలిపోయే తరానికి-రానున్న తరం మీద ఈ మమకారం లేకుండా

ఈ సృష్టి అవిచ్ఛిన్నంగా సాగేనా-అన్న ప్రశ్న సరళ మనసులో కదిలింది. ఆ అల్లరి పిల్లల్ని వారించడం కదులుతున్న రైలు బండిలో కూర్చున్న తన చేతకాదు కాని లేకుంటే కుర్ర వెధవల్ని నాలుగు తన్ని అవతలకు విసిరేద్దామనిపించింది సరళకు. కంట్లో ఏదో నలుసు పడింది.

ముందు స్టేషన్లో ఏదో రైలు ప్రమాదం జరిగిందనీ, ఈ రైలును రద్దు చేశారనీ నిరాశా, విసుగూ వ్యక్తం చేస్తున్నారు ప్రయాణికులు. ఇంతలో రైలు స్టేషన్ చేరుకుంది.

మైకులో రైల్వేవారి ప్రకటన వినిపిస్తోంది. రైలును రద్దు చేశారనీ, రైలు ఛార్జీలు వాపస్ చేసే ఏర్పాటు జరుగుతుందనీ, రెండు రోజుల్లో తీసుకోవచ్చుననీ ఆ ప్రకటన సారాంశం.

తోటి ప్రయాణీకుల నిరుత్సాహం ఎలా ఉన్నా సరళ మనసు విచిత్రంగా తేలికపడింది.

సావిత్రమ్మ రైలు నడుస్తున్నదన్న ధ్యాసలో ఉందే తప్ప - అది వెనక్కి వచ్చినట్లూ ప్రయాణం రద్దయినట్లూ ఆమెకు తెలియదు. కళ్ళు మూసుకుని ఆమె ఆలోచనల వలయాల్లో తిరుగుతోంది.

డెబ్బై ఏళ్ళ జీవితానుభవాలతో దగ్గర దగ్గర ముడతలు పడ్డ ఆమె ముఖంలోకి చూస్తూ - "అత్తయ్యా? లెండి" అని మృదువుగా తట్టి - "ఈ రైలు ఇవాళ పోదట. ప్రయాణం రద్దయింది. ఇంటికి పోదాం పదండి. అసలు ఇంక మీరు కలకత్తా వెళ్ళనే వద్దు" అంటూ అత్తగారి చెయ్యి పట్టుకుని ముందుకు నడిచింది సరళ.

చిన్న చిన్న అడుగులు వేస్తూ - వెంట నడుస్తున్న సావిత్రమ్మ హృదయాన్ని సరళ మాటలలోని మార్దవం సున్నితంగా తాకింది. తప్పిపోయిన ఆత్మీయత తిరిగి వచ్చి మెల్లగా తలుపు తట్టినట్లయింది.

— ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 18-11-1987